# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :305 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 16-02-2025 పేజీలు:4 వెల: 2.00


## పంజాబ్ సీఎంకు బీజేపీ కౌంటర్

న్యూఢిల్లీ: అక్రమ వలసదారుల్ని అమెరికా వెనక్కి పంపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఓ విమానం పంజాబ్‌కు ఫిబ్రవరి 5వ తేదీన చేరుకున్నది. ఇవాళ రాత్రి మరో డిపోర్ట్ వ్యక్తులతో కూడిన విమానం రానున్నది. ఈ నేపథ్యంలో పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ .. కేంద్రంపై విమర్శలు చేశారు. అక్రమ వలసదారులు పంజాబ్ నుంచి వెళ్లినట్లు మాత్రమే చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం వైఖరిని ఆయన ఖండించారు.పంజాబ్ సీఎం చేసిన వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్ ఇచ్చింది. ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ఆర్పీ సింగ్ తన ట్విట్టర్‌లో రియాక్ట్ అయ్యారు. అమెరికా నుంచి భారత్‌లో ప్రవేశించే అంతర్జాతీయ విమానాలకు.. అమృత్‌సర్ విమానాశ్రయమే అతి సమీపంగా ఉంటుందని చురక అంటించారు. అందుకే అక్రమ వలసదారులతో వస్తున్న విమానం అమృత్‌సర్‌లో దిగుతున్నట్లు విమర్శించారు. సమస్యను రాజకీయం చేయవద్దు అని, అవగాహనారాహిత్యంతో కుట్రలు పన్నరాదన్నారు.చాలామంది యువత అక్రమ రీతిలో అమెరికా వెళ్తున్నారు. అయితే వాళ్లను బోర్డర్ వద్ద పట్టేస్తున్నారు.

## కాంగ్రెస్ సర్కారుతో జెర పైలం: కేటీఆర్



హైదరాబాద్: వ్యవసాయరంగంలో సంతోషం ఆనవాళ్లు చెరిపేసి, సమైక్యరాష్ట్రం లో పీడించిన సంక్షోభం ఆనవాళ్లను తెలంగాణ నేలపై మళ్లీ తెస్తామంటే రైతాంగం సహించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆత్మగౌరవంతో బతికే అన్నదాతలపై ఈ వరుస దాష్టీకాలేంటని, మీరు చేసిన పాపాలకు బక్కచిక్కిన రైతులపై ఈ దుర్మార్గాలేంటని ప్రశ్నించారు. నిన్న గేటు ఎత్తుకెళ్లారు, నేడు స్టార్టర్లు పీక్కెళ్లారు, ఇక రేపు పుస్తెలతాళ్లు లాక్కెళతారా అని నిలదీశారు. తెలంగాణ ఆడబిడ్డలారా ఈ తెలివితక్కువ కాంగ్రెస్ సర్కారుతో జెర పైలంగా ఉండాలని సూచించారు. అప్పుల పాలైన అన్నదాతలపై ఇంత కక్ష ఎందుకని, కష్టాల్లో ఉన్న కర్షకులపై కాంగ్రెస్‌కు ఇంత కోపమా అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.“నిన్న గేటు ఎత్తుకెళ్లారు,

నేడు స్టార్టర్లు పీక్కెళ్లారు.. ఇక రేపు పుస్తెలతాళు లాక్కెళతారా??. తెలంగాణ ఆడబిడ్డలారా.. ఈ తెలివితక్కువ కాంగ్రెస్ సర్కారుతో జెర పైలం. అప్పుల పాలైన అన్నదాతలపై ఇంత కక్షనా? కష్టాల్లో ఉన్న కర్షకులపై కాంగ్రెస్‌కు ఇంత కోపమా??సాగు నీళ్లిచ్చే సోయి లేదు.. పంటలు ఎండుతున్నా పట్టింపు లేదు. కానీ.. రైతులు అష్టకష్టాలు పడుతుంటే వేధింపులా?. బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దుచేసిన నీటితీరువాను.. ఐదేళ్ల తరువాత ఇప్పుడు వసూళ్లకు తెగబడతారా??. తెలంగాణ రైతులంటే అంత అలుసైపోయారా?. ఓట్లనాడు ప్రేమ ఒలకబోసి గద్దెనెక్కాక నరకం చూపిస్తారా??.2 లక్షల రుణమాఫీ సక్కగ చేయని సన్నాసులు ఇంత దారుణానికి ఒడిగడతారా??. రైతు భరోసాకు సవాలక్ష ఆంక్షలు పెట్టి.. రైతన్నను సంక్షోభంలోకి నెట్టింది మీరు కాదా??. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి.. మళ్లీ అప్పులపాలయ్యేలా చేసిన పాపం మీది కాదా కాదా!!.ఆత్మగౌరవంతో బతికే అన్నదాతలపై ఈ వరుస దాష్టీకాలేంటి?. మీరు చేసిన పాపాలకు బక్కచిక్కిన రైతులపై ఈ దుర్మార్గాలేంటి?. వ్యవసాయరంగంలో సంతోషం ఆనవాళ్లు చెరిపేసి.. సమైక్యరాష్ట్రంలో పీడించిన సంక్షోభం ఆనవాళ్లను తెలంగాణ నేలపై మళ్లీ తెస్తామంటే రైతాంగం సహించదు. సంఘటితంగా పోరాడుతది..! సీఎంకు బుద్ధి చెబుతది..!!” అంటూ ట్వీట్ చేశారు.


## కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ నెరవేర్చడం లేదు

హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ నెరవేర్చడం లేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో కిషన్‌రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తోందని తెలిపారు. అన్ని జేఏసీ సంఘాలు బీజేపీకి మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్‌కు జాబ్ క్యాలెండర్ అమలు చేసే చిత్తశుద్ధి లేదు.. శక్తి లేదని ఆరోపించారు. పీఆర్సీ ఎందుకు ప్రకటించడం లేదు.. 6 డీ ఏలు ఎందుకు ఇవ్వట్లేదని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రూ.8000 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఇక గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు.. ఫుడ్ పాయిజన్ జరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థినులకు స్కూటీల సంగతి ఏమైంది? అని నిలదీశారు. అలాగే మహిళలకు ఇస్తామన్నా రూ.2,500 ఎక్కడా? అని ప్రశ్నించారు.‘రైతు భరోసా అరకొర చేశారు.. రైతు కూలీలకు 12 వేలు ఏమైంది.., జీవో 317 మీద 50 వేల మంది భవిష్యత్ గందరగోళంగా మారింది.టీచర్స్ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి.దశాబ్దాలుగా ఉపాధ్యాయులతో సన్నిహిత సంబంధాలున్న సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలి.మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీనే.” అని కిషన్‌రెడ్డి అన్నారు.“ఆర్ఆర్ఆర్‌కి రూ.26 వేల కోట్లు..జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్..మెగా టెక్స్ టైల్ పార్క్.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రామగుండంలో యూరియా ఉత్పత్తి కోసం రూ.7 వేల కోట్లు,జాతీయ రహదారులను 32 జిల్లాలతో కేంద్రం అనుసంధానం చేసింది.కాంగ్రెస్ ప్రజలకి ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదు. కేంద్రం ఇచ్చిన పథకాలను రాష్ట్ర పథకాలుగా ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ దివాలాకోరుతనానికి నిదర్శనం. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారు.కేంద్ర సంస్థల నుంచే వేల కోట్లు రుణాలు ఇచ్చాం.వాటి ద్వారానే ప్రభుత్వాలు నడుస్తున్నాయి.” అని పేర్కొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో హస్తం పార్టీకి ఇబ్బందులు తప్పవు..

హైదరాబాద్,అధికార కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేకపోయిందని కామెంట్ చేశారు. దీంతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హామీలపై కాంగ్రెస్ పార్టీ వివరణ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలకు వెళితే బాగుంటుందని సీపీఐ తరపున హస్తం పార్టీకి సూచిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా ఉన్న చోటే తాము పోటీ చేస్తామని.. మిగతా చోట్ల కాంగ్రెస్ పార్టీని కలుపుకుపోతామని కూనంనేని తెలిపారు.అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై పార్టీలో చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందన్నారు. మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో అత్యంత దారుణంగా చంపేస్తున్నారని.. ఆ అంశంపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.



## పాలనపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు...



ఖమ్మం, ఫిబ్రవరి15: సీఎం రేవంత్ పాలనలో ఓ ఒక్క వర్గం సంతోషంగా లేదని, పాలనపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్యే కవిత విమర్శించారు. ఖమ్మంలో కవిత శనివారం పర్యటించారు. ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారని కవిత మండిపడ్డారు. రేవంత్‌వి అన్నీ దొంగ మాటలే..బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్లేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతు బీమా , పింఛన్, ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు. రేవంత్‌వి అన్నీ దొంగ మాటలేనని విమర్శించారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో దొంగహామీలే తప్ప చేసింది ఏం లేదని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఖచ్చితంగా ప్రశ్నిస్తామని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలే అని హెచ్చరించారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా కల్పించారు. కేసులకు భయపడొద్దు, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కాగా అంతకుముందు ఖమ్మం వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రాంత ట్రిబుల్ ఆర్ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. ట్రిపుల్ ఆర్ రైతులకు గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉంటానని చెప్పి.. అధికారంలోకి రాగానే రేవంత్ మాట మరిచారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ట్రిపుల్ ఆర్ బాధితుల విషయంలో చొరవ తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.

## ఆధ్యాత్మిక యాత్రలో సరికొత్త రికార్డ్



ప్రయాగ్‌రాజ్:ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మరో రికార్డు సృష్టించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు పోటెత్తుతున్నారు. జనవరి 13న మహా కుంభమేళా మొదలైనప్పటి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు త్రివేణి సంగమంలో 50 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఇది మానవ చరిత్రలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక తీర్థయాత్ర, సాంస్కృతిక సామాజిక కార్యక్రమం. ఇప్పటికే 50 కోట్లకుపైగా భక్తులు మహా కుంభమేళాల పుణ్యస్నానాలు చేశారని తెలిపింది. భారత్, చైనాలు మినహా మిగతా జనాభా కంటే ఈ సంఖ్యే ఎక్కువ కావడం గమనార్హం. అమెరికా, రష్యా, ఇండోనేషియా, బ్రెజిల్ పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాల జనాభా కూడా 50 కోట్ల కంటే తక్కువే అని యూపీ ప్రభుత్వం పేర్కొంది.144 ఏళ్ల తర్వాత ఈ ఏడాది జనవరి 13న ప్రారంభమైన ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 50 కోట్ల మంది భక్తులు రావచ్చని మొదట అంచనా వేసినప్పటికీ అంచనాలకు మించి భక్తులు తరలివస్తున్నారు. మనదేశం నలుమూలల నుంచే గాక, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుండటం గమనార్హం. ప్రతి రోజు దాదాపు కోటి మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుండటం గమనార్హం.

## మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

సిద్దిపేట,ఫిబ్రవరి15:కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేటలో లక్ష్మణ్ పర్యటించారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ఒక వర్గానికి, సమాజానికి చెందిన వారు కాదు.. ప్రజలందరి మనిషి. ప్రపంచ ఖ్యాతి కలిగిన వ్యక్తి అని తెలిపారు. మోదీపై గతంలో రాహుల్ గాంధీ కూడా ఇలాగే అవాకులు, చెవాకులు పేలారని అన్నారు. రాహుల్‌కు పట్టిన గతే రేవంత్ కు పట్టడం ఖాయమని హెచ్చరించారు. మోదీని విమర్శిస్తే, పేరు వస్తుందని రేవంత్ అనుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన తప్పుల తడకగా మారిందని విమర్శించారు. మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనం మైనార్టీలతో కూడిన బీసీ కుల జాబితా అని చెప్పారు. ముస్లింలను బీసీలో చేర్చి..ఓట్ల కోసం పాకులడుతున్నారని మండిపడ్డారు. మత ప్రాతపదికన రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని చెప్పారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన గ్యారెంటీలకు తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజలు నిరాశతో ఉన్నారని చెప్పారు. మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావించి ప్రభుత్వానికి కళ్లెం వేయాలని అన్నారు. మేధావులు ఆలోచన చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డిను చూసి సమాజం తల దించుకుంటోందని విమర్శించారు. 20 మ్యాచ్ ఆడిన కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌కూ పడుతుందని మండిపడ్డారు. 15 ఏళ్లల్లో ఢిల్లీలో మూడు సార్లు రాహుల్ డకౌట్ అయ్యారని విమర్శించారు. మోదీ తినే ఆహారాన్ని, వేసుకునే బట్టలను విమర్శిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ వేల కోట్ల నిధులు ఇస్తున్నా.. ఇన్ని విమర్శలా చేస్తారా అని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కేంద్రానికి సవాల్... జనగణనతో పాటు కులగణన చెయ్యాలి..

హైదరాబాద్, కేంద్రానికి సవాల్ విసిరారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. జనగణనతో పాటు కులగణన చెయ్యాలన్నారు. కేంద్రం లెక్కలు, తెలంగాణ ప్రభుత్వం చేసిన లెక్కలను సరిపోల్చుదామన్నారు రేవంత్ రెడ్డి. మరోవైపు కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ లను బహిష్కరణ చెయ్యాలని రేవంత్ రెడ్డి అన్నారు. బహిష్కరణ కోసం అందరి సమక్షంలో తీర్మానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వే తప్పుల తడక అని చెప్పే ప్రయత్నం బీఆర్ఎస్ చేసిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

ప్రధాని మోదీ పుట్టుకతో బీసీ కాదు. మోదీ లీగల్లి కన్వర్టెడ్ బీసీ. సర్టిఫికెట్ లో మోదీ బీసీ. కానీ.. మోదీ మనసంతా బీసీ వ్యతిరేకి. భారత్ జోడో యాత్రలోనే రాహుల్ గాంధీ స్పష్టంగా కులగణన చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఉన్న అన్ని జాతులకు వారి ఫలాలు అందాలని రాహుల్ గాంధీ ఆకాంక్షించారు. రాష్ట్రంలో డోర్ టు డోర్ వెళ్లిన సిబ్బంది ముందే డేటా ఎంట్రీ చేశాం.కేసీఆర్ సర్వే.. కాకి లెక్కల సర్వే. తెలంగాణ సమాజంలో తిరిగే హక్కు కేసీఆర్, కేటీఆర్, సంతోష్ రావ్ లకు లేదు. సమగ్ర కుటుంబ సర్వేకి కేసీఆర్ లెక్కలు ఇచ్చి ఉంటే మాట్లాడే హక్కు ఉండేది. సర్వేలో డేటా ఇయ్యని లిస్ట్ లో ముందు వరుసలో కేసీఆర్, కేటీఆర్, సంతోశ్ రావ్, గ్యాంబ్లింగ్ శ్రీనివాస్ లు ఉన్నారు.కేసీఆర్ లెక్క తేలితే.. వార్డు మెంబర్ కూడా ఆ కుటుంబానికి రాదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా. జనజీవన స్రవంతిలో కలవని వారి కోసం రెండో విడత సర్వేకి అవకాశం ఇచ్చిన ప్రభుత్వం మాది” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.బీసీ కులగణన సర్వేకు సంబంధించి గాంధీభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించింది కాంగ్రెస్. కులగణన సర్వేలో వివరాలను పక్కాగా నమోదు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలాంటి అవినీతి జరగలేదని, వివక్ష చూపలేదని రేవంత్ అన్నారు.అయినా ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని నిప్పులు చెరిగారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కొన్ని కులసంఘాల విజ్ఞప్తి మేరకు రీ సర్వే చేసేందుకు నిర్ణయించామని సీఎం రేవంత్ తెలిపారు. ప్రధాని మోదీపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు రేవంత్ రెడ్డి. మోదీ మొదటి నుంచి బీసీ కాదని, మధ్యలో కన్వర్టెడ్ బీసీ అని చెప్పారు.



## గిరిజన జాతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్



మహబూబ్‌నగర్: గిరిజన జాతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆయన ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రస్తుత తరం మీద ఉందని చెప్పారు. గిరిజనులకి రాజ్యాధికారం కల్పించేందుకు తండాలను కేసీఆర్ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన హయాంలో మహబూబ్ నగర్ నియోజక వర్గ పరిధిలోని తండాల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం, కమ్యూనిటీ హాల్స్, గ్రామపంచాయతీ భవనాలు, క్రిడా ప్రాంగణాలు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించినట్టు చెప్పారు.గిరిజన భవన్, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలంతో పాటు రూ 1.10 కోట్ల నిధులు ఇచ్చి పనులు పూర్తి చేయించినట్టు చెప్పారు. గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు ప్రత్యేక వసతి గృహాలు నిర్మాణం చేసిన్నట్టు తెలిపారు.కార్యక్రమం లో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు,పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ నాయక్, రాంలక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, గణేష్, కిషన్ పవర్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం

సూర్యాపేట,రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం అయ్యింది. ఈనెల 16 నుంచి 20 వరకు పెద్దగట్టు జాతర జరగనుంది. పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా పెద్దగట్టులో లింగమంతులస్వామి జాతర పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ జాతరకు 20 లక్షల మందికిపైగా భక్తులు రానున్నారు. రూ.5 కోట్లతో రహదారుల మరమ్మతులు, గుట్టపై నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీల పనులు చేపట్టారు.. గుట్టపై చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 21 శాఖల జిల్లా అధికారుల కోసం గుట్ట కింద పందిళ్లతో ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే ప్రముఖుల కోసం అతిథి గృహాన్ని సిద్ధం చేశారు. గుట్టపై ఎక్కడపడితే అక్కడ జంతుబలి చేయకుండా ప్రత్యేకంగా షెడ్డును నిర్మించారు. గుట్టపై జంతువుల రక్తాన్ని శుభ్రంచేసే యంత్రాన్ని సిద్ధం చేశారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టకు కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానం చేసేందుకు గుట్ట కింద కోనేరుతోపాటు గుట్టపైన షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న శాశ్వత మరుగుదొడ్లతోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దగట్టు జాతర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈనెల16న జాతర ప్రారంభం కానుండగా 16,17,18 తేదీల్లో హైదరాబాద్ - విజయవాడ 65వ జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనాలను నార్కెట్ పల్లి మీదుగా దారి మళ్లించనున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం పోలీసులు నాలుగు చోట్ల ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కోసం మొత్తం 25 ఎకరాలు సేకరించి చదును చేస్తున్నారు. సూర్యాపేట మీదుగా పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తుల వాహనాలు హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటి తండాకు వెళ్లే మార్గంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి దురాజ్‌పల్లి నుంచి వచ్చే భక్తుల వాహనాలను పాత కలెక్టరేట్ కార్యాలయం వెనుక కేటాయించిన స్థలంలో పార్కింగ్ కు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే వీఐపీ వాహనాలను పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురుగా ఉన్న స్థలంలో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు.

## రిషి టీంతో అంతేనా ?

అమరావతి,ఐప్యాక్ ని నమ్ముకుంటే పొలిటికల్ గా పవర్ కి ప్యాకప్ చెప్పేయడమేనా అన్న చర్చ సాగుతోంది. ఐప్యాక్ అన్నది ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలో ఉన్నపుడు బ్రహ్మాండంగా నడచింది. ఎపుడైతే రిషీ టీం చేతుల్లోకి వెళ్ళిందో అధికారంలో ఉన్న వారు మాజీలు అవుతున్నారు. దానిని అచ్చమైన ఉదాహరణగా నిన్న జగన్ నేడు అరవింద్ కేజ్రీవాల్ కనిపిస్తారు. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ వైసీపీని నామరూపాలు లేకుండా చేసింది ఐప్యాక్ రిషీ టీం ఔట్ డేటెడ్ వ్యూహాలే అని అంతా విమర్శించారు.వారిని నమ్మి నిండా వైసీపీ మునిగింది. గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ పట్టవు. క్యాడర్ అసలు అవసరం లేదు, లీడర్స్ ని అంతకంటే పట్టించుకోరు. సంక్షేమ పథకాలు అమలు చేశాం ఇవే గెలిపిస్తాయని అంతపురంలో కూర్చుని వ్యూహ రచన చేశారు. దాంతో పార్టీగా వైసీపీ ఎంత దెబ్బ తిందో అంతా చూశారు.ఇదే ఐప్యాక్ టీం 2019లో జగన్ ని పార్టీని సవ్య దిశగా నడిపించింది. దానికి కారణం ఆనాడు ప్రశాంత్ కిశోర్ ఉన్నారు. ఆయన క్యాడర్ ని బూస్టప్ చేస్తూ ప్రోగ్రామ్స్ డిజైన్ చేశారు. పార్టీని పటిష్టం చేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. అంతే కాదు ప్రచార్మలో కొత్త పుంతలు తొక్కించారు. వినూత్నమైన ఆలోచనలతో వైసీపీని ముందుకు నడిపించారు.ఆ తరువాత ఐప్యాక్ కాస్తా రిషి టీం చేతిలోకి వెళ్ళింది, వైసీపీ అధికారం పోగొట్టుకోవడమే కాకుండా పాతాళానికి పోయింది. కట్ చేస్తే అదే ఢిల్లీ ఎన్నికల్లోనూ జరిగింది. 2020లో కేజ్రీవాల్ రెండోసారి సునాయాసంగా అధికారంలోకి వచ్చారు. మొత్తం 70 అసెంబ్లీ సీట్లకు గానూ ఆయన 62 సీట్లు గెలుచుకున్నారు. దాని వెనక పీకే సారథ్యంలోని ఐప్యాక్ టీం ఉంది.కానీ 2024 ఎన్నికల్లో సారథ్యం చేసింది రిషీ టీం. దాంతో ఆప్ కి చావు దెబ్బ తగిలింది. ఏపీలో ఏమి చేశారో అదే స్ట్రాటజీస్ ని వాడారు. ఉచితాల మీద ప్రచారం చేసారు. పైగా గ్రాస్ రూట్ లెవెల్ ని టచ్ చేయలేకపోయారు. బీజేపీ దూకుడుగా దూసుకొస్తూ కేజ్రీవాల్ అని అవినీతిపరుడు అని ఆరోపిస్తున్న వేళ దానిని అధిగమిస్తూ జనాలను తమ వైపు తిప్పుకునేలా వ్యూహాలను రచించడంలో రిషి టీం వైఫల్యాలు కనిపించాయని అంటున్నారు.ఒక వైపు కేజ్రీవాల్ ని అవినీతిపరుడు అంటూ బలంగా బీజేపీ జనంలోకి వెళ్ళి ఎస్టాబ్లిష్ చేయగలిగింది. అదే సమయంలో వాటిని తిప్పికొట్టడంతో పాటు బీజేపీ పాలనలో లోపాలను ఎండగట్టాల్సిన ఆప్ వ్యూహాలు తిరగబడ్డాయి. సెల్ఫ్ డిఫెన్స్ ని కూడా చేసుకోలేక చతికిలపడ్డారు. దాంతోనే ఆప్ ఓటమిని మూటకట్టుకుంది అంటున్నారు.ఇక రిషీ టీం ఫెయిల్యూర్ రికార్డులను ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. గోవా ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ కి ఎన్నికల వ్యూహాలను రచించడానికి ఒప్పందం కుదుర్చుకున్న ఈ టీం అక్కడ ఆ పార్టీని కనీసంగా నిలబెట్టలేకపోయింది. హర్యానా ఎన్నికల్లో ఆప్ ని సోది లోకి రాకుండా చేయగలిగింది అని అంటున్నారు.మరి ఇలాంటి ట్రాక్ రికార్డు ఉన్న రిషీ టీం సక్సెస్ ని అందిస్తుందా అన్నది చర్చగా ఉంది. వ్యూహాలు ఎప్పటికపుడు మార్చాలి. ప్రజల నాడి పట్టుకోవాలి. నేల విడిచి సాము చేయకూడదు, కానీ వైసీపీని ఆకాశంలో పెట్టి ఎన్నికలను నడిపించాలని చూసింది ఈ టీం అని విమర్శిస్తారు. ఇక రిషీ టీం ని వైసీపీ కంటిన్యూ చేస్తుంది అన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆప్ ఫలితాల తరువాత అయినా పునరాలోచించుకోవాలని అంటున్నారు. లేకపోతే ఏమైనా జరగవచ్చు అంటున్నారు.ఏ రకమైన వ్యూహాలు ఎందుకు జనాలలో క్యాడర్ తో కనెక్ట్ అవుతూ పార్టీని పునర్ నిర్మించుకుంటే కనుక కచ్చితంగా వైసీపీకి మంచి రోజులు వచ్చినట్లే అంటున్నారు. మరి వైసీపీ హైకమాండ్ ఐప్యాక్ సేవలను కొనసాగిస్తుందా లేదా అన్నది ఒక ఆసక్తికరమైన చర్చగానే పార్టీలో సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## వంటమనిషితో అసభ్య ప్రవర్తన

ఒంగోలు,వంట మనిషితో అసభ్యంగా ప్రవర్తించి, ఆమెపై చెప్పుతో దాడి చేసిన ఓ ఉపాధ్యాయుడికి శాస్తి చెప్పారు. అదే గ్రామానికి చెందిన కొందరు పట్టుకుని దేహశుద్ధి చేశారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం పంచాయతీలోని వీవై కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల వెంకట రవికుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా చెప్పుతో కొట్టాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ పెద్దలు ఉపాధ్యాయుడిని నిలదీయగా.. 'మీరేంటి నాకు చెప్పేది..' అంటూ వారిపై ఎదురుదాడికి దిగాడు. రవికుమార్ ఎంతకూ వినకపోవడంతో స్థానికులు విద్యుత్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపాధ్యాయుడిని పీఎస్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి నాయక్ పాఠశాలకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయాలు...

నిజామాబాద్, స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అందరిదీ బిసిల దారిగా మారింది. బిసిలపై గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రేమను ఒలకబోస్తున్నారు. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బిసి బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో అన్ని పార్టీలది బిసి దారి కావడం గుర్తించాలి. దీంతో రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అన్ని పార్టీలు ప్రధానంగా బీసీ, వర్గీకరణ అంశాలపై దృష్టి పెడుతున్నాయి. రాష్ట్రమంతా కులగణన చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే తప్పులతడకగా మారిందని బిజెపి, బిఆర్‌ఎస్‌లు విమర్శిస్తున్నాయి. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఆయన మొత్తం బిసి గళాన్ని ఎత్తుకున్నారు. బీసీ నేతలు ఆర్. కృష్ణయ్య.. ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న కూడా బీసీ జపం చేస్తున్నారు. బీసీ ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా ఎత్తుగడలు వేస్తున్నారు. బీసీల విషయంలో వీరిని ఆయా పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు నడిపిస్తున్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది. ఎమ్మెల్సీ కవిత బిసి నినాదంతో రాష్ట్రంలో పర్యటనలు చేస్తున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఎలుగెత్తుతున్నారు. అందుకే స్థానిక ఎన్నికల్లో 'బీసీ' అంశమే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లేందుకు పార్టీలన్నీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. బీసీల అంశాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలుచుకుంటే .. బీఆర్‌ఎస్ మాత్రం అదే అస్త్రాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రయోగి స్తున్నది. కుల గణన ప్రక్రియ కాంగ్రెస్‌కు ప్రతికూలంగా చేసేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నది. కులగణన అంశంపై బీజేపీ పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నది. పార్టీ బలోపేతంతోపాటు రాష్ట్రంలో తమ పార్టీ పాగా వేసేలా వ్యూహాత్మక ఎత్తుగడ వేస్తున్నది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీనే సీఎం చేస్తానని ఇప్పటికే ప్రకటించగా.. ఇక రాష్ట్ర అధ్యక్ష పదవిని సైతం బీసీకే ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో బీజేపీ స్టేట్ చీఫ్ గా బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ను÷– నియమించిన విషయాన్ని గుర్తు చేస్తున్నది. త్వరలో ప్రకటించబోయే స్టేట్ చీఫ్ కూడా బీసీ వ్యక్తే అనే సంకేతాలు ఇచ్చింది. కుల గణనపై చర్చలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా బీసీ జనాభాను తక్కువ చేసి చూపించిందని ఆరోపించారు. దీంతో బీసీల నుంచి మద్దతు లభిస్తుందని ఆ పార్టీ భావిస్తున్నది. పార్టీ లైన్‌కు భిన్నంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ అంశాన్ని ఎత్తుకున్నారు. ఏడాది క్రితమే యునైటెడ్ పూలే ఫ్రంట్ ఏర్పాటు చేసి బీసీ సంఘాలను ఏకం చేసే ప్రయత్నం చేశారు. తరచూ వారితో సమావేశమవుతూ కాంగ్రెస్ 42శాతం హామీపై ఒత్తిడి తేవాలని దిశానిర్దేశర చేశారు. బీసీ సంఘాలతో పలుమార్లు భేటీ అయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం ప్రభుత్వం వెల్లడించిన కుల గణన గణాంకాలను తప్పుల తడక అని విమర్శించారు. ఇటీవల హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో బీసీలతో కలిసి భారీ బహిరంగ సభ కూడా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కులగణన సర్వే వివరాలు వెల్లడించడంతో రానున్న స్థానిక ఎన్నికల్లో ఈ అంశం ప్రధానాస్త్రంగా మారింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా కులగణన చేయలేదని, ఇచ్చిన మాటప్రకారం తాము చేసి చూపించామని ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నది. సర్వేలో పాల్గొనని వారి కోసం 28 వరకు మరో అవకాశం ఇచ్చామని, దీనిని ఉపయోగించుకోవాలని బిసి మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం సర్వే చేసిందని చెబుతున్నారు. ఇక బీఆర్‌ఎస్ పార్టీ.. కులగణన సర్వే తీరుపై విమర్శలు చేస్తున్నది. కులగణన సర్వే సరిగా చేయలేదని,



బీసీ జనాభా లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని ప్రభుత్వాన్ని ఎండగడుతున్నది. ఇది బీసీ వ్యతిరేక సర్కార్ అంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు బీసీ నేతలను సమాయత్తం చేస్తున్నది. కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ.. తెలంగాణలో గ్రామస్థాయిలోకి వెళ్లేందుకు బీసీ అంశాన్ని బ్రహ్మాస్త్రంగా వాడుకోవాలని చూస్తున్నది. భవిష్యత్తులో తమ పార్టీ గెలిస్తే బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అని ఇప్పటికే ప్రకటించింది. అంతేకాకుండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా బీసీలకు ఇచ్చి.. తద్వారా లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చాటాలని వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇటు కులగణన, అటు 4 పథకాలను ఒకే రోజు ప్రారంభించింది. ఇచ్చిన మాట అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతున్నది. ఇందులో భాగంగా శాస్త్రీయంగా, సమగ్రంగా, పకడ్బందీగా కుల గణనను నిర్వహించి.. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీల జనాభా లెక్కలు తేల్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కుల గణన చేశామని ఆ పార్టీ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులకు కులగణన డేటా ఉపయోగంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను రాజకీయంగా కల్పిస్తామని, లీగల్ గా చిక్కులు వచ్చినా పార్టీపరంగా న్యాయం చేసి.. మాటకు కట్టుబడి ఉంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ఒకేరోజు ప్రారంభించింది. ఈ పథకాలను గడప గడపకూ అందించాలని ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టానం.. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధుల ద్వారా కుల గణన అంశంతోపాటు 4 పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయి, పార్లమెంట్ ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బ తగిలిన బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ ప్రజల్లో సానుభూతి సాధించుకుని, వచ్చే ఎన్నికలకు సిద్ధంకావాలని చూస్తోంది. అందుకే ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటున్నది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా కనీసం పరువు నిలుపుకోవాలని బీఆర్‌ఎస్ తన వ్యూహాలకు పదును పెట్టింది. ప్రభుత్వం బహిర్గతం చేసిన కుల గణన లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని ఆ పార్టీ బీసీ నేతలతో విమర్శలు చేయిస్తున్నది. ఈ సర్వే పెద్ద బోగస్ అంటూ బీసీలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నది. ఇది బీసీ వ్యతిరేక ప్రభుత్వమని ముద్ర వేసేందుకు బీసీలను ప్రధానాస్త్రంగా వినియోగించుకుంటున్నది. బీసీలకు కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తున్నదని, అందుకే జనాభా లెక్క తక్కువ చేసి చూపిస్తున్నదని, 42శాతం రిజర్వేషన్ హామీ తుంగలో తొక్కిందంటూ విమర్శలు గుప్పిస్తున్నది.

# ట్రంప్ నిర్ణయాల వల్ల భారతదేశానికి లక్షల కోట్ల రూపాయల నష్టం..



వాషింగ్టన్,అమెరికా వివిధ దేశాలతో, ముఖ్యంగా చైనాతో భారీ వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. అంటే అమెరికా నుంచి చైనాకు ఎగుమతి అయ్యే వస్తువుల విలువ కంటే, చైనా నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువుల విలువ ఎక్కువగా ఉంది. 2023-24లో భారతదేశంతో కూడా అమెరికాకు 35.31 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై అమెరికా విధించే సగటు టారిఫ్ రేటు 3.3% అయితే, అమెరికా నుంచి భారతదేశానికి దిగుమతి అయ్యే వస్తువులపై భారత్ విధించే సగటు టారిఫ్ రేటు 17% ఉంది. ఈ వ్యత్యాసం కారణంగా ట్రంప్ ఇప్పుడు టారిఫ్‌లను పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు."ప్రతీకార సుంకాల విషయంలో భారతదేశాన్ని కూడా మినహాయించే అవకాశం లేదు." భారతదేశ ప్రధాన మంత్రి మోదీతో ఇటీవల జరిగిన సమావేశంలో రోజునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. 2021-24 మధ్య కాలంలో భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకునే చర్యల వల్ల భారతదేశంపై ఎంత ప్రభావం పడుతుందనేది ఆసక్తికరమైన విషయంగా మారింది.

### ట్రంప్ టారిఫ్‌లు ఎందుకు విధిస్తున్నట్లు?

విదేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై ప్రతి దేశమూ పన్నులు/సుంకాలు (టారిఫ్/కస్టమ్స్ సుంకం) విధిస్తుంది. ఇది దేశీయ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడం, ఉద్యోగ సృష్టి మరియు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం కోసం చేస్తుంటారు. ప్రతీకార సుంకం అంటే, అమెరికా నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై ఇతర దేశాలు ఎంత టారిఫ్ విధిస్తే, అదే రకమైన వస్తువులపై అమెరికా కూడా టారిఫ్‌లు విధిస్తుంది.

### ప్రజలపై అధిక దిగుమతి సుంకాల తీవ్ర ప్రభావం

దేశీయ పరిశ్రమలను రక్షించాలనే ఉద్దేశ్యంతో విదేశీ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఉదాహరణకు, ఒక వాహన కంపెనీ తమ దేశంలో తయారు కాని విడిభాగాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి అధిక పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇది ముడి పదార్థాల ధరలను పెంచి, అంతిమ ఉత్పత్తి ధరను కూడా పెంచుతుంది. ఫలితంగా, ఇలాంటి సుంకాలు దేశీయ వినియోగదారులపై కూడా భారం అవుతాయి.
ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం అమెరికా ఈ కింది దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తోంది. డెయిరీ ఉత్పత్తులు: 188%, పండ్లు మరియు కూరగాయలు: 132%, తృణ ధాన్యాలు: 193%, నూనెగింజలు, కొవ్వులు, నూనెలు: 164%, పానీయాలు మరియు పొగాకు: 150%, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు: 53%, చేపల ఉత్పత్తులు, రసాయనాలు: 35% నుంచి 56%.

భారతదేశానికి సంబంధించి ఈ రంగాలపై ప్రభావం పడవచ్చు:ఔషధాలు, రత్నాభరణాలు, ఐరన్ అండ్ స్టీల్ (ఉక్కు, ఇనుము), వాహనాలు, ఎలక్ట్రికల్ మెషినరీ, జౌళి, వస్త్రాలు, ఆహార పదార్థాలు.

### ప్రతీకార సుంకాల ప్రభావం తక్కువగా ఉండవచ్చు: జీటీఆర్ఐ

అమెరికా నుంచి భారతదేశం మరింత చమురు, గ్యాస్, సైనిక పరికరాలు కొనుగోలు చేస్తుందని వాషింగ్టన్‌లో ప్రధాన మంత్రి మోదీతో చర్చల తర్వాత ట్రంప్ ప్రకటించారు. ఇది అమెరికా వాణిజ్య లోటును తగ్గిస్తుంది. అమెరికా సుంకాలు పెంచడం వల్ల భారతదేశంపై పెద్ద ప్రభావం ఉండకపోవచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. భారతదేశానికి అమెరికా ఎగుమతి చేసే వస్తువుల విలువలో 75% వరకు సగటు టారిఫ్ 5% లోపే ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. రెండు దేశాల మధ్య ఎగుమతుల్లోని వైవిధ్యం కారణంగా ప్రతీకార సుంకాలు పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుంచి ప్రపంచదేశాలకు 27.8 బిలియన్ డాలర్ల ఔషధాలు ఎగుమతి అయ్యాయి, ఇందులో 31.35% అమెరికాకు ఎగుమతి అయింది.

### అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించిన భారత్

హార్లే డేవిడ్సన్ భారతదేశానికి చెందిన హీరో మోటోకార్ప్‌తో భాగస్వామ్యంగా తయారు చేసిన మోటార్‌సైకిళ్ళపై సుంకాలు తగ్గించబడ్డాయి.అమెరికా నుంచి దిగుమతి అయ్యే బోర్బన్ విస్కీపై సుంకాలు 50%కు పరిమితం చేయబడ్డాయి.

### స్టాక్ మార్కెట్లకు రూ.లక్షల కోట్లు నష్టం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు పెంచడం, అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం కారణంగా..భారతీయ స్టాక్ మార్కెట్ పై కూడా ప్రభావం పడింది. 2024 సెప్టెంబరు 27 నాటికి బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.477.93 లక్షల కోట్లకు చేరుకుంది.కానీ ఇప్పుడు ఇది రూ.400.19 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే, నాలుగున్నర నెలల్లోనే రూ.77.74 లక్షల కోట్ల మార్కెట్ విలువ క్షీణించింది.ఇది 2024 ఏప్రిల్ 8 నాటి స్థాయికి తగ్గింది. అంటే,10 నెలల క్రితం స్థాయికే మార్కెట్ విలువ తగ్గింది.2024 సెప్టెంబరు 27 నాటికి మార్కెట్ సంపద విలువ రూ.478 లక్షల కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.78 లక్షల కోట్లు నష్టపోయి..2025 ఫిబ్రవరి 14 నాటికి రూ.400 లక్షల కోట్లుగా మిగిలింది.ట్రంప్ టారిఫ్‌లు, అమెరికా ఆర్థిక విధానాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థపై కొనసాగుతున్న ప్రభావాలు మరింతగా గమనించాల్సిన అవసరం ఉంది.

## వంశీ చరిత్ర మొత్తం అరాచకమే

అమరావతి, వైసీపీ నేత వల్లభనేని వంశీ చరిత్ర మొత్తం అరాచకమయమని మాజీమంత్రి జవహర్ ఆరోపించారు. గన్నవరం పార్టీ కార్యాలయం దాడి ఘటనలో 71వ నిందితుడిగా ఉన్న వంశీ తానంతట తానే వచ్చి కిడ్నాప్ కేసులో ఏ1గా ఇరుక్కున్నారని అన్నారు. కేవలం తాడేపల్లి ప్యాలెస్ పెద్ద సైకో జగన్‌ను సంతృప్తి పరిచేందుకు ఇష్టానుసారం విధ్వంసం సృష్టించారని అన్నారు. కేసు నుంచి తప్పించుకునేందుకు ఎస్సీ యువకుడు సత్యవర్ధన్‌ను బలిపశువును చేద్దామని చూసి అడ్డంగా దొరికాడని అన్నారు. తన అహంకార ప్రదర్శనకు ఎస్సీ యువకుడిని తక్కువ చులకన చేయాలనుకున్నారని చెప్పారు. వంశీ లాంటి దుర్మార్గులను సంఘ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.

## యువతిపై యాసిడ్ దాడి కేసు...

అమరావతి,అన్నమయ్య జిల్లాలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. నిందితునిపై కఠిన చర్యలకు ఆదేశించారు. ఘటన వివరాలు తెలుసుకుని తగిన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి వారిపట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లె గ్రామంలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బాధిత యువతికి, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు.అలాగే యాసిడ్ దాడి ఘటనపై మంత్రి లోకేష్ స్పందించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి అండగా నిలుస్తామని తెలిపారు. యాసిడ్ దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని అన్నారు. యాసిడ్ బాధితురాలి తండ్రి జనార్దన్‌కు మంత్రి లోకేష్ ఫోన్ చేశారు. బాధితురాలి ఆరోగ్యంపై వాకబు చేశారు. 'చెల్లి కోలుకోవడానికి అత్యంత మెరుగైన వైద్యం అందిస్తాం. ఆమెను నా సొంత చెల్లిగా భావించి అండగా నిలుస్తా. యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దాడి చేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తాం. అలాంటి సైకోలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. అధైర్య పడొద్దు, మీ వెంట నేనున్నాను' అని మంత్రి భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి మండుపల్లి రాంప్రసాద్‌తో కూడా లోకేష్ మాట్లాడారు. గౌతమి కోలుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వైద్యానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా మంత్రి రాంప్రసాద్‌కు మంత్రి లోకేష్ సూచనలు చేశారు. యువతిపై యాసిడ్ దాడి ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ప్యారంపల్లెకు చెందిన బాధితురాలి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. యువతి కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. యాసిడ్ దాడికి పాల్పడిన ఉన్మాదిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులకు హోంమంత్రి అనిత ఆదేశించారు. కాగా..ప్రేమించలేదనే కారణంగా యువతిపై ప్రేమోన్మాది యాసిడ్‌తో దాడికి పాల్పడటం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బ్యూటిషియన్‌గా చేస్తున్న గౌతమి అనే యువతిపై యాసిడ్‌తో దాడి చేశాడు. ముందుగా యువతికి బలవంతంగా యాసిడ్ తాగించిన ప్రేమోన్మాది.. ఆపై ఆమె మొహంపై యాసిడ్ పోశాడు. తీవ్రంగా గాయపడిన యువతిని మదనపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగూరుకు తరలిస్తున్నారు. యువతిపై యాసిడ్ దాడి చేసిన యువకుడు ప్రీప్లాన్డ్‌గా పురుగులు మందు తాగి మదనపల్లి ఆస్పత్రికిలో చేరాడు. దీంతో నిందితుడు తప్పించుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఎవరిపైనా ప్రభుత్వానికి కక్షసాధింపు లేదు

ఒంగోలు,కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు, కక్ష సాధింపులకు పాల్పడటం లేదని మంత్రి బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదుట మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో మంత్రి బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ... విచారణలో నిజమని నిర్ధారణ అయితేనే అరెస్టులు చేస్తున్నామని తెలిపారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా వైసీపీ నేత వల్లభనేని వంశీ దుశ్చర్యల గురించి మాట్లాడామని చెప్పుకొచ్చారు. పార్టీ కార్యాలయాలను కూడా వంశీ, వైసీపీ నేతలు తగులబెట్టారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తిని కూడా కిడ్నాప్ చేసి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించారని మండిపడ్డారు. హామీలు ఇచ్చిన మేరకు ఏపీలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. వైసీపీకి ప్రజలు బుద్ది చెప్పినా నాయకుల పరిస్థితి మారలేదని అన్నారు. రేపు కందుకూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని మంత్రి బాలవీరాంజనేయస్వామి తెలిపారు.

## హామీల చిట్టా..

న్యూఢిల్లీ, ఢిల్లీ సిఎంగా ఉన్న సమయంలో కేజ్రీవాల్‌ఉచిత పథకాల పేరుతో పంపదేరం సాగించారు. అందుకే తనకు తిరుగులేదని నిరూపించారు. పంజాబ్‌లో కూడా ఇదే ఎత్తుగడతో అధికారం దక్కించుకున్నారు. తనకు తిరుగులేదనుకున్న కేజ్రీవాల్ తన ఇంటిని అద్దాలమేడగా తీర్చి దిద్దుకున్నారు. తనకు తిరుగు లేదని, బటన్ నొక్కడం వల్ల ప్రజలంతా తనకే ఓటేస్తారని ఎపిలో జగన్ కూడా నమ్మారు. అందుకే విశాఖ రుషికొండలో అత్యాధునిక సౌథాలు నిర్మించుకున్నారు. మళ్లీ తానే సిఎంను అవుతానని, విశాఖ నుంచి పాలిస్తానని ప్రకటించుకున్నారు. ప్రజలు ఓడించారు.. లేకుంటే ఎపి మరింత దోపిడీకి గుయ్యేది. తెలంగాణలో కూడా ఇలాగే కెసిఆర్ ఓడిపోయి ఫామ్‌హౌజ్÷–కే పరిమితం అయ్యారు. ఉచిత పథకాలతో ప్రజలనుమచ్చిక చేసుకుని, అభివృద్దిని అటకెక్కించిన ఈ ముగ్గురు నేతలు వరుసగా పరాజయం పొందారు. ఈ ముగ్గురి దారి ఒకటేనని ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు. ముగ్గురూ అధికారం కోసం అనేక పథకాలు ప్రకటించారు. అభివృద్దిని దారి మళ్లించారు. ప్రజలను నమ్మించి నట్టే ముంచారనడం లో సందేహం లేదు. వీరి కారణంగా ఆయా రాష్ట్రాలు దివాళా తీసాయి. ఇకపోతే ఢిల్లీ బడ్జెట్ రూ. 76 వేల కోట్లు అయితే ,అందులో దాదాపు రూ. 15వేల కోట్లకు పైగా ఉచితాలకు, సబ్సిడీలకే ఖర్చవుతుందని, రూ. 8,159 కోట్ల మేరకు బడ్జెట్ లోటు ఏర్పడుతుందని లెక్కలు తేలాయి. పెద్ద ఎత్తున అప్పులు చేయక తప్పదని తెలిసి కూడా కేజీవ్రాల్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజలకు అనేక హామీలను కురిపించారు. జాతీయ చిన్నపొదుపు మొత్తాల నిధి నుంచి కూడా ఆప్ ప్రభుత్వం అప్పులు చేసి రోజువారీ ఖర్చులను భరించాల్సి వచ్చింది. మహిళలకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన క్రింద నెలకు రూ. 2100 చొప్పున నగదు బదిలీ చేస్తామని, ఆలయాలు, గురుద్వారాల్లో పూజారులకు నెలకు రూ. 18వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆటోడ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా, వివాహాలు, స్కూలు యూనిఫారంల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తామని, ఢిల్లీలో అద్దె గృహాలలో ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని మొన్నటి ఎన్నికల్లో ఆప్ అధినేత కేజ్రీవాల్ హామీలు ప్రకటించారంటే.. ఆయన అధికార కండూతి ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేజీవ్రాల్ కంటే ఒక అడుగు ముందుకు వేసి మహిళలకు రూ. 2500 చొప్పున నెలకు చెల్లిస్తామని, గర్భిణీ స్త్రీలకు రూ. 21వేలతో పాటు ఆరు పోషకాహార కిట్లను పంచిపెడ్తామని బీజేపీ ప్రకటించింది. ఢిల్లీ మాత్రమే కాదు, ఇప్పుడు యావద్దేశమూ ఉచితాల బాటలో పయనిస్తోంది. 2024-25లో 9 రాష్ట్రాలు మహిళలకు నగదు బదిలీ క్రింద రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టాయని చట్టసభల పనితీరును అధ్యయనం చేసే పీఆర్ఎస్ పరిశోధనా సంస్థ వెల్లడించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా ఉచితాలతో సాగుతున్నాయి. రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదన్న ధోరణిలో అధికారమే అంతిమ లక్ష్యంగా పార్టీలు ఎజెండాలు ప్రకటించుకుంటున్నాయి. కేంద్ర ఆర్థిక పరిస్థితి కూడా అంత సవ్యంగా ఏమీ లేదు.

# వైసీపీ నేతల కొత్తరాగం.. జగన్ కొత్త వ్యూహమేనా!?



అమరావతి,వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఆ పార్టీ నేతలు అధికార మదంతో వ్యవహరించారు. వైఎస్ జగన్ దగ్గర నుంచి కింది స్థాయి కార్యకర్తల వరకు మేము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందన్న ధీమతో హద్దులు మీరి ప్రవర్తించారు. ప్రతిపక్ష పార్టీల నేతలను ఇబ్బందులకు గురిచేయడంతోపాటు.. సామాన్య ప్రజలనుసైతం నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారు. సీన్ కట్ చేస్తే గత ఎన్నికల్లో ఓటు ద్వారా వైసీపీకి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు వైసీపీ నేతలు నోరుపారేసుకుంటున్నారు. ఇంకా మేమే అధికారంలో ఉన్నామన్న భ్రమల్లోనే ఉన్నారు. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. ఐదేళ్లు అధికారం మత్తులో హద్దులు మీరి ప్రవర్తించిన వైసీపీ నేతలపై కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది.వైసీపీ హయాంలో అవినీతి అక్రమాలను వెలికితీస్తూ ఒకవైపు.. అధికారం మత్తులో నోరుపారేసుకున్న నేతలపై మరో వైపు కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నది. దీంతో వైసీపీ నేతల్లో భయం పట్టుకుంది. చాలా మంది వైసీపీ నేతలు తమ వంతు ఎప్పుడొస్తుందోనన్న భయంతో వణికిపోతున్నార్న. ఈ క్రమంలో వైసీపీ నేతలు కొత్తరాగం అందుకుంటున్నారు. వల్లభనేని వంశీ అరెస్టుతో ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తమకు జ్ఞానోదయం అయిందనట్లుగా మాట్లాడుతున్నారు. అయితే, వైసీపీ నేతలు అందుకున్న కొత్తరాగం వెనుక ఏమైనా వ్యూహం ఉందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పరిశీలకులు కూడా పక్కా వ్యూహంతోనే వైసీపీ నేతలు కొత్త రాగం అందుకున్నారని విశ్లేషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాంలో అవినీతికి పాల్పడిన పార్టీ నేతలపై కేసులు నమోదు చేస్తోంది. మరోవైపు ఐదేళ్ల కాలంలో అధికార మదంతో హద్దులుమీరి మాట్లాడిన వారిపైనా కేసులు నమోదు చేసి జైళ్లకు పంపిస్తోంది. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గతంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు పిటీషన్ దాఖలు చేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ ఫిర్యాదుదారుడిగా ఉన్నాడు. అయితే, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి బెదిరింపులకు గురిచేయడంతో తనకు టీడీపీ కార్యాలయంపై దాడి కేసుకు ఎలాంటి సంబంధం లేదని ఇటీవల కోర్టులో చెప్పించారు. ఆ తరువాత సత్యవర్ధన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అసలు విషయంపై కూపీలాగగా.. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి, బెదిరించి అలా చెప్పించారని పోలీసులు గుర్తించారు. దీంతో సత్యవర్ధన్ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి కావడంతో కిడ్నాప్ కేసు కింద వంశీతో పాటు మరికొందరిపై అట్రాసిటీ కేసును నమోదు చేసిన పోలీసులు.. వల్లభనేని వంశీని అరెస్టు చేశారు. కోర్టు ఆయనకు 14రోజులు రిమాండ్ విధించింది. దీంతో వంశీతో పాటు మరో ఇద్దరిని పోలీసులు విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. వంశీని తమ కస్టడీలోకి తీసుకొని పోలీసులు విచారించనున్నారు. ఈ ఘటన తరువాత వైసీపీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు వంశీకి మద్దతుగా మాట్లాడుతుండగా.. మరికొందరు వంశీని పార్టీనుంచి బహిష్కరించాలన్న వాదనను తెరపైకి తెస్తున్నారు.గత ఎన్నికల్లో వైసీపీ ఓటమి తరువాత ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు వల్లభనేని వంశీ, కొడాలి నాని, రోజా వంటి నేతల తీరుతోనే వైసీపీ ఓటమి పాలైందని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి టార్గెట్‌గా తమ పార్టీ నేతలు చేసిన కామెంట్స్‌ను..టీడీపీ అస్త్రంగా మల్చుకుందని కేతిరెడ్డి గతంలో కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. చంద్రబాబు కంటతడి పెట్టుకోవడంతో ఆ ఇష్యూను సానుభూతిగా మల్చుకోవడంలో కూటమి సక్సెస్ అయిందని కేతిరెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వల్లభనేని వంశీ అరెస్టు తరువాత కొందరు వైసీపీ నేతలు వంశీ, కొండాలి నాని, రోజా మాట తీరు వల్లనే ఓడిపోయామని బహిరంగంగా చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వాసుపల్లి గణేష్ అయితే.. తమ పార్టీ నేతలు ప్రత్యర్థులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్లే గత ఎన్నికల్లో ఓడిపోయామని చెప్పారు. విజయసాయిరెడ్డి మాదిరిగా వల్లభనేని వంశీ, కొడాలి నాని కూడా పార్టీని వీడి వెళ్లిపోతే మంచిదన్నట్లుగా ఆయన మాట్లాడారు. మాజీమంత్రి రోజా ఆచితూచి మాట్లాడితే మంచిదని సూచించారు. విజయసాయిరెడ్డి పార్టీని వీడటం శుభసూచకమన్న వాసుపల్లి.. ఆయన ఇచ్చిన తప్పుడు సమాచారం వల్లే ఉత్తరాంధ్రలో పార్టీ ఓడిపోయిందన్నారు. పార్టీ కార్యకర్తల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాల్సిన సాయిరెడ్డి.. పార్టీకి సమస్యగా మారారని అన్నారు. సాయిరెడ్డి జగన్‌ను మిస్ గైడ్ చేశారని చెప్పారు. సాయిరెడ్డి వల్లే రుషికొండ ప్యాలెస్ కట్టాల్సి వచ్చిందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. వాసుపల్లితో పాటు పలువురు వైసీపీ నేతలు వంశీ అరెస్టును సమర్థిస్తున్నారు. వల్లభనేని వంశీ అరెస్టు తరువాత వైసీపీ నేతలు కొత్తరాగం అందుకోవటం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ఓటమికి ప్రధాన కారణం.. జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలే. ప్రతిపక్ష పార్టీల నేతలతో పాటు వైసీపీ ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించిన సామాన్య ప్రజలను జగన్ తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేశారు. పోలవరం పడకేసింది. రాష్ట్రంలో కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకుండా జగన్ ఐదేళ్ల పాలన అంతా కక్ష సాధింపునకే కేటాయించారు. జగన్ తీరు కారణంగా పనులులేక లక్షలాది మంది పేద ప్రజలు పక్కరాష్ట్రాలకు వలస వెళ్లిన పరిస్థితి. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఏపీ అన్నిరంగాల్లో వెనుకబడి పోయింది. దీంతో వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని జగన్ తాకట్టు పెట్టేస్తారన్న భయంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటువేసి వైసీపీకి ప్రతిపక్ష హొదాను కూడా ఇవ్వలేదు. అయితే, దారుణ ఓటమి తరువాత కూడా ప్రజలకు నేను మంచే చేశానంటూ జగన్ స్టేట్‌మెట్లు ఇస్తుండటం గమనార్హం. తాజాగా వల్లభనేని వంశీ అరెస్టు తరువాత వైసీపీ నేతలు కొత్తరాగం అందుకున్నారు. జగన్ మెరుగైన పాలన అందించారని, కానీ, వల్లభనేని వంశీ, కొడాలి నాని, విజయసాయిరెడ్డి, రోజా వంటి నేతలు హద్దులు మీరి మాట్లాడి వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత భావం ఏర్పడేలా చేశారంటూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. తద్వారా వైసీపీ ఓడిపోయింది జగన్ వల్ల కాదు కొందరు వైసీపీ నేతలు నోరుపారేసుకోవటం వల్లనేనన్న వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ప్రయత్నిస్తున్నారు. వంశీ అరెస్టుపై జగన్ స్పందించకపోవడం చూస్తుంటే.. ఈ వ్యూహాన్ని రచించి, పార్టీ నేతల చేత అమలు చేయిస్తున్నది స్వయంగా జగనేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తద్వారా ఐదేళ్ల పాలనలో తన తప్పిదాలకు కొందరు పార్టీ నేతలను బలిచ్చేసి తాను సుద్ధపూసగా మళ్లీ జనం ముందుకు రావాలని జగన్ ప్రయత్నిస్తున్నారంటున్నారు.

# ఇసుక రీచ్‌ల అక్రమాలపై అధికారుల దృష్టి



నల్లగొండ,ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించా లని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. అలాగే సిఎస్ కూడా సమీక్షించి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో పరిస్థితి దారికి వస్తోంది. ఇసుక అందుబాటులో లేక ఏడాదిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు పుంజుకునే అవకాశాలున్నాయి. ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు మీనమేషాలు లెక్కపెట్టిన మైనింగ్ అధికారులు అక్రమ దందాను అడ్డుకునేందుకు తమ శాఖలో సరిపడా స్టాఫ్ లేదని చెబుతూ వచ్చారు. దీంతో జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకూ ఇసుక కొరత తప్పలేదు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇండ్లు కట్టుకోవడానికి ఇసుక అందుబాటులో లేక తిప్పలు పడ్డారు. ఇదే అదనుగా ట్రాక్టర్‌కు రూ.6,500, టిప్పర్‌కు రూ.60 వేల చొప్పున ఇసుక మాఫియా వసూలు చేయడంతో నిర్మాణం రంగం కుదేలైంది.డిండి పరివాహక పరిసర ప్రాంత గ్రామాల్లో పగలు రాత్రి అంటూ తేడా ఉండదు. దుందుభి నది పరివాహక గ్రామాల్లో జేసీబీలను వాగుల్లోకి దింపి ఇసుకను తోడేస్తున్న మాఫియా, ఇసుకను జిల్లా సరిహద్దులు దాటించి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఇక ఇసుక తరలిస్తున్న గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీలు, గ్రూపుల వారీగా ఇసుకను తరలించేందుకు పోటీ పడుతున్నాయి. అధికారుల చర్యలతో పరివాహక ప్రాంత గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ల నుంచి విముక్తి దొరుకుతుందని ఆయా ప్రాంత రైతులు అంటున్నారు. డిండి వాగు మాఫియాకు అడ్డాగా మారింది. మిడ్జిల్, తాడూరు, తిమ్మాజీపేట, తెల్కపల్లి, వంగూరు, కల్వకుర్తి, ఉప్పునుంతల మండలాల నుంచి అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నా మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లోని చిన్నా చితక వాగులను వదలని ఇసుక మాఫియా పొలిటికల్? సపోర్ట్?తో వాగులను తోడేస్తున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఇసుక దందాకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం నేలచూపులు చూస్తున్న విషయ విదితమే. దీనికితోడు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తుండటం, అధికారులు, కాంట్రాక్టర్లు వారితో మిలాఖతై ఇసుక దోపిడీకి తెరలేపడం ఆదాయంపై తీవ్రంగా ప్రభావం చూపిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా టీజీఎండీసీ ఆదాయం గణనీయంగా పడిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే మళ్లీ పునరావృతమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇసుక ఆదాయాన్ని రూ.832 కోట్లకు పెంచాలని టీజీఎండీసీ ల క్ష్యంగా పెట్టుకున్నది. ఇసుక రీచ్‌ల వద్ద మూ డు షిఫ్టుల్లో పనిచేసే విధంగా ప్రణాళికలు రూ పొందించింది. అయితే, కంచె చేను మేసిన చందంగా మైనింగ్, రవాణా, విజిలెన్స్ విభాగం అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ లక్ష్యాన్ని అందుకుంటుందా అన్నది చూడాలి.డిండి వాగులో ఇసుకను తోడే ప్రాంతాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఇసుక తోడేందుకు వాడే హిటాచీ, జేసీబీలు, రవాణకు వాడే ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకతో పాటు మైనింగ్ దందాకు అడ్డుకట్ట వేస్తామని స్పష్టం చేశారు. ఇసుక దందాను అడ్డుకునేందుకు డీఎస్పీ నేతృత్వంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశారు. మైనింగ్ శాఖ గుర్తించిన రీచ్ ల నుంచి సాండ్‌ట్యాక్సీ ద్వారా ఇసుక వినియోగానికి అనుమతులు ఇవ్వనున్నారు. అధికారికంగా గుర్తించిన ఇసుక రీచ్‌ల వద్ద మైనింగ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. బుక్ చేసిన ట్రాక్టర్లకు కూలీలతో ఇసుక తవ్వకునేలా నిబంధనలు విధించారు.రు. ఇసుక తవ్వకాలకు సాయంత్రం 5 వరకు సమయం కేటాయించి, బుక్ చేసుకున్న వారు రీచ్‌ల వద్ద కూపన్లను ఇస్తే ఇసుక తరలించడానికి అనుమతిస్తారు.

# పెళ్లిళ్లపై బంగారం ధరల ప్రభావం



విజయవాడ,అసలే మాఘమాసం కావడంతో తెలుగు రాష్ట్రాల్లో మార్చి 26 దాకా లక్షలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో పెరిగిన బంగారం రేట్లను చూసి ఆడపిల్లల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. క్రమంగా బంగారం ధరలు పెరుగుతూ హడలెత్తిస్తున్నాయి. పుస్తెలు చేయించడాని కే మూర్ఛ వచ్చేంతగా ధరలు పెరుగుతున్నాయి. 22 క్యారెట్ల బంగారం ధర దాదాపు 80వేలకు చేరువలో ఉంది. వెండి ధర కిలోపై రూ.వెయ్యి పెరిగి రూ. లక్షా7వేలుగా నమోదైంది. ఎన్నడూ లేని విధంగా రూ.86 వేలు దాటిన బంగారం ధరలను చూసి అందరూ షాక్ కు గురవుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో జనవరి 1న 24 క్యారెట్ల బంగారం రూ.78వేలు, 22 క్యారెట్ల బంగారం రూ.71,500 పలికింది. నెల వ్యవధిలోనే బంగారం ధర రూ.8వేలకు పైగా పెరగడం గమనార్హం. అమెరికాలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక యూఎస్ డాలర్ బలపడ్తున్నది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో తమ పెట్టుబడులను ఉపసంహరిం చుకుంటుండడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఫలితంగా దేశీయ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెడ్తుండడం వల్లే గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. మున్ముందు 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష దాటడం ఖాయమని అంచనా వేస్తున్నారు. పెళ్లిళ్ల సమయంలో బంగారం రేట్లు అనూహ్యంగా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. నిజానికి జనవరి 30న మాఘమాసం ప్రారంభమైంది. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 26 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పెళ్లిళ్లు, గృహప్రవేశాలు జరగనున్నాయి. తెలుగిండ్లలో బంగారం లేకుండా పెళ్లిళ్లు జరగవంటే అతిశయోక్తి కాదు. ఆయా కుటుంబాలు తాహతును బట్టి పెళ్లి కూతుర్లకు, ఆడపడుచులకు తులాల కొద్దీ బంగారు ఆభరణాలు కొనడం ఆనవాయితీ. కానీ పెరిగిన బంగారం ధరలతో వధువుల తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. అలాగే పట్టుచీరలు, ఆహార పదార్థాలతో పాటు అన్ని వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

## సుంకాలపై వెనక్కి తగ్గేది లేదు...

వాషింగ్టన్, సుంకాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు. ఇది దేశ హితం కోసం తీసుకున్న నిర్ణయమని అన్నారు. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు. 'ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ అంటే ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం..అన అన్నారు. భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్‌లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్‌లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీలు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య అని అన్నారు.

# మతిస్తిమితం కోల్పోయిన కెటిఆర్...

నిజామాబాద్,కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ కు దమ్ము, ధైర్యం ఉంటే సిరిసిల్లలో రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డిని రాజీనామా చేయాలనడం హాస్యాస్పదమన్నారు. సోషల్ మీడియా, పింక్ మీడియాను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఎవరేం చేసినా మళ్లీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం ఎలా నడస్తుందో చూస్తానని కెటిఆర్ అనడం సరైనది కాదు సూచించారు. ప్రభుత్వాన్ని ఎలా నడపాలో తమకు తెలుసన్నారు. 60 వేల కోట్లు ఉన్న అప్పులను 6 లక్షల కోట్లకు తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమాజాన్ని మద్యానికి బానిసలుగా చేశారని చెప్పారు.తెలంగాణను క్యాసినో హబ్‌గా కెటిఆర్ మార్చారని ఆరోపించారు. ఆధునిక హంగులతో విదేశాల్లో ఆడే క్యాసినో, జూదాలు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరగడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్ బావమరిది ఇంట్లో ఓ పార్టీలో కొకైన్ పట్టుబడిందని ఆయన గుర్తు చేశారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌస్‌లో జరుగుతున్న అక్రమాలకు ముమ్మాటికీ బాధ్యుడు కెటిఆర్



అని ఆయన ఆరోపించారు. దొంగలకు లీజుకు ఇస్తే వాళ్ళు దొంగలే అవుతారన్నారు. ఇక పోలీసుల అండర్ కవర్ ఆపరేషన్‌లో భాగంగా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌస్ గుట్టు బయట పడిందన్నారు. కెసిఆర్ కుటుంబంలో నలుగురు వాళ్ల కోసం మాత్రమే పోరాటం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. బిఆర్ఎస్ హయంలో ఇచ్చిన పర్మిషన్‌తో రెండేళ్ల నుంచి ఈ పందెలు జరుగుతున్నాయన్నారు. పది మంది ఎమ్మెల్యేలు ఎందుకో పార్టీ ఫిరాయించారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలన్నారు. హీరో కావడానికి కెటిఆర్ జీరో పనులు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

# నిలిచిపోయిన అమరావతి పనులు..



అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు నిలిచిపోయాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. ముందుగా నిర్ణయించిన మేరకు అమరావతి పనులకు టెండర్లు పిలవాల్సి ఉన్నా, సీఆర్డీయే అధికారులు దానికి బ్రేక్ వేశారు. అయితే రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు ఈఆ ప్రక్రియను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మాత్రమే అమరావతి పనులకు టెండర్లు పిలిచి, పనులను పరుగులెత్తించాలని అధికారులు నిర్ణియించారు. ఎన్నికల కోడ్ కు అమరావతి పనులకు సంబంధం లేదని చెబుతూ వచ్చిన అధికారులు, ఈ విషయంలో ఎన్నికల కమిషన్ నుంచి క్లారిటీ తీసుకుందామని కూడా ఒక దశలో భావించారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో పనులను చేపట్టడం సరికాదని భావించిన ప్రభుత్వం కోడ్ ముగిసిన తరువాతే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో టెండర్ల ప్రక్రియను సీఆర్డీఏ నిలిపివేసింది. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. టెండర్లను ఆహ్వానించి వెంటనే పనులు ప్రారంభించాలని ప్రభుత్వం కూడా నిర్ణయించింది. ఇందుకు కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. సరిగ్గా ఈ తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల కోడ్ ముగిసే వరకూ పనులను నిలిపివేయాలనీ, టెండర్ల ప్రక్రియను కూడా ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతనే ఆరంభించాలని నిర్ణయించింది.

# ప్రభుత్వానికి జయలలిత ఆస్తులు.. ఏమేమి అప్పగిస్తున్నారో తెలుసా.?

హైదరాబాద్,ఒకప్పుడు తెలుగు, తమిళ్, కన్నడ భాషా చిత్రాలలో నటించి , తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ను సొంతం చేసుకున్నారు దివంగత నటీమణి జయలలిత . 1965లో 'కథానాయకుడు' అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. ఆ తర్వాత ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి దిగ్గజ హీరోల సరసన నటించి మెప్పించింది. ముఖ్యంగా ఎంజీఆర్ సరసన ఎన్నో చిత్రాలలో నటించిన ఈమె ఎంజీఆర్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత ఆయన అడుగుజాడల్లోనే జయలలిత కూడా రాజకీయాల్లోకి చేరింది. 1984 నుండి 1989 వరకు తమిళనాడు రాజ్యసభ సభ్యురాలిగా పనిచేసిన ఈమె ఎంజీఆర్ మరణం తర్వాత ఆయన వారసురాలిగా ప్రకటించుకుంది. ఇక 2014 సెప్టెంబర్ 27న ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కూడా అరెస్టు అయింది. దాంతో తన ముఖ్యమంత్రి పదవి కూడా రద్దయింది. పదవిలో ఉండగానే కేసులో ఇరుక్కున్న ఈమె పదవీచ్యుతురాలైన మొదటి ముఖ్యమంత్రిగా కూడా నిలిచింది. అయితే 2015 మే 23న మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టింది. ఇక అలా రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఈమె.. రాజకీయాల్లోకి వెళ్ళకముందు దాదాపు 42 చిత్రాలలో నటించింది.

తమిళనాడు ప్రభుత్వానికి జయలలిత ఆస్తులు అప్పగింత..

ఇదిలా ఉండగా జయలలిత వివాహం చేసుకోలేదు. దాంతో వారసులు కూడా లేరు. ఈ నేపథ్యంలోనే ఆమె సంపాదించిన ఆస్తి మొత్తం ఎవరికి పోతుంది? అనే ప్రశ్నలు గత కొన్ని సంవత్సరాలుగా తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె ఆస్తిని ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి అందజేయాలని గత కొన్ని రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బెంగళూరులోని పరప్పన అగ్రహారం జైలులో భద్రపరిచిన తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన ఆస్తుల పత్రాలను కోర్టు అధికారులు నిన్న రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ఈ మేరకు ఏ ఏ ఆస్తులను ప్రభుత్వానికి అప్పజెప్పారు ఇప్పుడు చూద్దాం



ఆరు ట్రంక్ పెట్టెలలో ఆస్తులు..

కర్ణాటక ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించిన ఆస్తులలో పదివేల చీరలు, 750 జాతుల పాదరక్షలు,27 కిలోల బంగారం, వజ్రాభరణాలు, రత్నాలు, 1,672 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు, 601 కిలోల వెండి వస్తువులు, నివాసాలకు సంబంధించిన దస్తావేజులు, 8,376 పుస్తకాలు కూడా ఉన్నాయి. వీటిని భారీ భద్రత మధ్య ఆరు ట్రంకు పెట్టెలలో తరలించారు న్యాయమూర్తి హెచ్ ఎన్ మోహన్ సమక్షంలో వీటిని అధికారులకు అప్పగించడం జరిగింది. అసలు విషయంలోకి వెళ్తే.. ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన కేసును 2014లో తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ చేయడం జరిగింది. ఈ క్రమంలోనే అక్కడ జప్తు చేసిన ఆస్తులు, పత్రాలను కర్నాటకకు తరలించి బెంగళూరులోని పరప్పన అగ్రహారం జైలులో ఇప్పటివరకు చాలా భద్రంగా భద్రపరిచారు . ఇక జప్తు చేసిన సమయంలో ఈ ఆస్తుల విలువ రూ.913.14 కోట్లుగా అధికారులు అంచనా వేయగా.. ఇప్పుడు దాని విలువ రూ.4 వేల కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా భారీ భద్రత మధ్య ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి అప్పజెప్పింది. ప్రస్తుతం ఈ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com